విజయం దక్కాలి.. దశ తిరగాలి



రూ.లక్షల్లో ప్యాకేజీలిచ్చే కార్పొరేట్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలున్నా.. ప్రభుత్వ ఉద్యోగానికి ఉండే క్రేజ్ చెప్పలేనంత. ప్రస్తుత సమాజంలో ప్రభుత్వ ఉద్యోగికి ఉన్న గుర్తింపు, ఉద్యోగ భద్రత మరెందులోనూ లేదంటే అతిశయోక్తి కాదు. అందుకే సర్కారీ కొలువు కోసం ఏళ్ల తరబడి శ్రమిస్తున్న యువత ఎందరో..! అలాంటి వారికి విశాఖ పౌర గ్రంథాలయం(పబ్లిక్ లైబ్రరీ) ఓ దిక్సూచి. వివిధ ఉద్యోగ పరీక్షలకు పోటీ పడుతున్న అభ్యర్థులు పరస్పరం స్ఫూర్తి పొందుతూ, వందలాది మంది గ్రంథాలయంలోని పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు పట్టుదలగా పరిశ్రమిస్తున్నారు.


పౌరగ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న ఉద్యోగార్థులు


టైం వృథా కాకుండా.. లైబ్రరీ ఆవరణలో భోజనం చేస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ ఉద్యోగ సాధనే లక్ష్యంగా శ్రమిస్తున్న యువత

బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ, గ్రూప్స్ నోటిఫికేషన్ల విడుదల

ఆగస్టు వరకు కేంద్ర ప్రభుత్వ రంగంలో పలు ఉద్యోగాలకు పరీక్షలు

పౌర గ్రంథాలయంలో పుస్తకాలతో కుస్తీ పడుతున్న ఉద్యోగార్థులు

సీతంపేట: రానున్న ఆరు నెలల్లో కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాలలో భర్తీ చేయనున్న ఉద్యోగాల కోసం నోటిఫికేషన్లు ఇటీవల విడుదల చేసింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే కల నెరవేర్చుకునే ప్రయత్నంలో నిరుద్యోగ యువత నిమగ్నమైంది. విశాఖ పౌరగ్రంథాలయంలో చూస్తే రోజూ 800–1000 మంది వరకు నిరుద్యోగ యువత రానున్న పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు. ఉదయం 8 గంటలకు లంచ్ బ్యాగ్‌తో చేరుకుని, రాత్రి 8 గంటల వరకు లైబ్రరీ, దాని పరిసరాల్లోనే చదువుకుంటున్నారు. పౌర గ్రంథాలయ యాజమాన్యం సైతం పోటీ పరీక్షల విద్యార్థులకు అవసరమైన వసతులు, పుస్తకాలు అందుబాటులో ఉంచింది. క్విజ్ పోటీలు, గ్రూప్ డిస్కషన్స్, నిపుణులచే కెరీర్ గైడెన్స్ అందిస్తూ, ఇతోధికంగా సహకరిస్తోంది.

కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్లలో కొన్ని..

ఇండియా పోస్ట్ విభాగంలో..		సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్	179
ఐపీపీబీ	68	ఎన్‌ఎల్‌సీ	167
ఎస్‌బీఐ పీవోస్	600	నేషనల్ అల్యూమినియం కంపెనీ	518
ఎస్‌బీఐ క్లరికల్	14,191	ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా	89
బ్యాంక్ ఆఫ్ బరోడా	1267	ఈఎస్‌ఐ	608
కెనరా బ్యాంక్	60	సీబీఎస్‌ఈ	212
		ఆర్‌ఆర్‌బీ గ్రూప్–డి	32,438
		ఢిల్లీ సబార్డినేట్ సర్వీసెస్	432

వీటితోపాటు రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం 16 వేల టీచర్ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేన్ విడుదల కానున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌లో 35 వేల పోస్టులు, గ్రూప్–1, గ్రూప్–2 మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. దీంతో పౌర గ్రంథాలయంలో ఉద్యోగార్థులు సీరియస్ ప్రిపరేషన్లో తలమునకలై ఉన్నారు.

గ్రూప్-2 మెయిన్స్‌కు..



నేను బీఎస్సీ పూర్తి చేశా. గతేడాది ఫిబ్రవరిలో జరిగిన గ్రూప్–2 ప్రిలిమ్స్ పాసయ్యా. ఈ నెల 23న జరగనున్న మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్నా. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా రెండేళ్లుగా పౌర గ్రంథాలయంలోనే ప్రిపేర్ అవుతున్నాను. ఎమ్మార్వో అవ్వాలని ఆకాంక్ష. – సీహెచ్ దిలీప్

రైల్వేలో జాబ్ కోసం...



నేను బీటెక్ పూర్తి చేశాను. రైల్వేలో జాబ్ సాధించాలని రెండేళ్ల నుంచి పౌర గ్రంథాలయంలో చదువుతున్నాను. ఆర్‌ఆర్‌బీ గ్రూప్–డి పోస్టులకు నోటిఫికేషన్ వచ్చింది. ఆగస్టులో పరీక్ష జరుగుతుంది. మ్యాథ్స్, జీకే, రీజనింగ్, సైన్స్ సబ్జెక్టులు ప్రిపేర్ అవుతున్నాను. – పి.గోపి


క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సివిల్స్ లక్ష్యంగా..



బీటెక్ పూర్తి చేసి, ప్రస్తుతం ఎంబీఏ చదువుతూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా. గతేడాది జరిగిన గ్రూప్–2 ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయ్యాను. అప్పటి నుంచీ మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్నాను. సివిల్స్ సాధనే నా లక్ష్యం. అందుకే రెండేళ్లుగా పౌర గ్రంథాలయంలోనే ప్రిపేర్ అవుతున్నాను. –బి.ఇందు

బ్యాంకు ఉద్యోగం సాధిస్తా..



నేను బీఎస్సీ మ్యాథ్స్ చదివా. బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం సాధించాలని రెండున్నరేళ్లుగా ప్రిపేర్ అవుతున్నా. బయట ఇన్‌స్టిట్యూట్‌లో కోచింగ్ తీసుకుంటూ, మిగిలిన సమయంలో రోజూ పబ్లిక్ లైబ్రరీకి వచ్చి చదువుకుంటున్నా. ఎస్‌బీఐ, యూకో బ్యాంకు నోటిఫికేషన్స్ వచ్చాయి. – జి. ధనుంజయ్

క్లుప్తంగా

రైతు బజార్లో 139 స్టాళ్లకు డ్రా


డ్రా తీసిన స్టాల్ నెంబర్ టోకెన్ ఇస్తున్న ఈవో కృష్ణమూర్తి

సీతమ్మధార: స్థానిక రైతుబజారులో సోమవారం 139 స్టాళ్లకు డ్రా తీసి రైతులకు రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి టోకెన్లు అందించారు. ఈ సందర్భంగా ఎస్టేట్ అధికారి మాట్లాడుతూ మార్కెటింగ్‌శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతి వారం రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. రైతులు విధిగా వారికి కేటాయించిన స్టాళ్లలోనే విక్రయాలు జరపాలని సూచించారు. స్టాళ్లు ఉన్న రైతులు కూరగాయల్ని నేలమీద విక్రయించరాదన్నారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


అక్కయ్యపాలెంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సుంకర శ్రీనివాసరావు

సీతంపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ఎన్నికల్లో అన్ ఎయిడెడ్, ఎయిడెడ్ విద్యా సంస్థల సంఘాలు, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బలపర్చిన విద్యావేత్త డాక్టర్ సుంకర శ్రీనివాసరావు సోమవారం అక్కయ్యపాలెంలోని పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్నానని, డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా తనకున్న అనుభవంతో టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సుందరంగా పోలీస్ స్టేషన్లు


చెట్లు, తుప్పలు తొలగించాక ఫోర్త్‌టౌన్ స్టేషన్

సీతమ్మధార : నగరంలోని బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఉన్న ఫోర్త్‌టౌన్, ద్వారకా పోలీసుస్టేషన్లు సుందరంగా ముస్తాబయ్యాయి. స్టేషన్ ఆవరణలో దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు, పలు చెట్లను తొలగించారు. దీంతో పోలీస్ స్టేషన్ లుక్ పూర్తిగా మారిందనే చెప్పాలి. ఇక్కడ రెండు పోలీసు స్టేషన్లలో శాంతిభద్రతలు, క్రైం, ట్రాఫిక్ విభాగాలలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. నగర పోలీసకమిషనర్ శంఖబ్రత బాగ్చి బాధ్యతలు స్వీకరించాక పోలీస్ స్టేషన్లను తనిఖీ చేస్తూ పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రం చేస్తూ, కొత్త రూపురేఖలు తీసుకొచ్చారు. రిసెప్షన్ కౌంటర్ వద్ద ఫిర్యాదుదారులకు సౌకర్యాలు మరింత మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకున్నారు. రెండు స్టేషన్లలోనూ సీపీ ఆదేశాల నేపథ్యంలో కేసుల వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయడం విశేషం.

పోర్టు కార్మికుల పోరాటానికి సంపూర్ణ మద్దతు


సత్కార సభలో అతిథులతో జిల్లా ఐఎన్‌టీయూసీ నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు డీఎల్‌బీ కాలనీ శాంతినగర్‌లో నేషనల్ పోర్టు ట్రస్ట్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు గొర్లె చందు ఆధ్వర్యంలో జాతీయ పోర్టు ఐఎన్‌టీయూసీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జాతీయ ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ అధ్యక్షుడు అబుబక్కర్(మంగుళూర్), ప్రధాన కార్యదర్శి రాణా(కాండ్ల పోర్ట్)లను ఘనంగా సత్కరించారు. అధ్యక్షుడు అబుబక్కర్ మాట్లాడుతూ విశాఖ పోర్ట్ కార్మికుల సమస్యలపై చేస్తున్న అన్ని పోరాటాలకు తమ పూర్తి మద్దతు, జాతీయ కార్యవర్గంలోని సభ్యులకు మరింత ప్రోత్సాహం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి నాగభాష్యం, ఈశ్వరరావు, యూనియన్ నాయకులు గురుప్రసాద్, వెంకటరావు, రమణ, సత్యనారాయణ, అప్పారావు, ఆశిష్, రాజు, తిరుపతిరావు, హేమంత్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా ట్రాఫిక్ ఐలాండ్‌లు


తహసీల్దార్ కార్యాలయం జంక్షన్‌లో నిరుపయోగంగా ట్రాఫిక్ ఐలాండ్

సీతమ్మధార: స్థానిక కూడళ్లలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఐలాండ్‌లు అలంకార ప్రాయమయ్యాయి. పోలీస్ అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయ కూడలి, ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పెట్రోల్‌బంక్ దరి ట్రాఫిక్ ఐలాండ్‌లు ఉన్నా.. ట్రాఫిక్ నియంత్రణ కోసం కానిస్టేబుళ్లను మాత్రం నియమించలేదు. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. స్థానికులు సమాచారం ఇస్తే గాని ట్రాఫిక్ పోలీసులకు ఇక్కడేం జరుగుతుందో తెలియని పరిస్థితి. గురుద్వార్ వద్ద పోలీస్ అవుట్ పోస్టు ఉన్నప్పటికీ హైవేపై అతివేగంగా దూసుకొచ్చే వాహనాలతో ప్రమాదాలు జరుతున్నాయని స్థానికులు చెప్తున్నారు. అల్లూరి సీతారామరాజు విగ్రహ జంక్షన్‌లో ఉన్న పోలీస్ అవుట్ పోస్టును రోడ్డు విస్తరణలో తొలగించారు. దీంతో ఇక్కడ వాహనదారులు ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. పోలీస్ అధికారులు స్పందించి ట్రాఫిక్ ఐలాండ్లలో కానిస్టేబుళ్లను నియమించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రైల్వే వందేళ్ల ప్రగతిలో కార్మికుల కృషి

మర్రిపాలెం: భారతీయ రైల్వే ఏర్పాటై వందేళ్లు పూర్తి కావడం చాలా ఆనందంగా ఉందని సీనియర్ డీఈబీ బి.షణ్ముఖరావు అన్నారు. ఈ మేరకు సోమవారం డీఈ సాహో, జనరల్ ఎస్ఎస్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో మర్రిపాలెం రైల్వే స్టేషన్ నుంచి ఎలక్ట్రికల్ లోకో షెడ్ వరకు సుమారు 500 మంది రైల్వే ఉద్యోగులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వందేళ్ల ఈ ప్రయాణం, రైల్వే ప్రగతి వెనుక ప్రతి కార్మికుడి కష్టం దాగి ఉందన్నారు. మూల మహేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటరాజునగర్‌లో చోరీ

సీతమ్మధార: దొండపర్తిలోని తాళం వేసిన ఇంట్లో దొంగతనం జరిగిన ఘటనపై ఫోర్తుటౌన్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కరణం గోపీనాథ్ అనే వ్యక్తి దొండపర్తిలోని వెంకటరాజునగర్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. గత నెల 31న విజయనగరం జిల్లా ఎస్.కోటలోని బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడ ఉండగా ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఫోన్ రావడంతో కంగారుగా ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో వెండి కంచం, కుందులు పోయినట్లు గమనించారు. వెంటనే 112 కాల్ చేసి సమాచారం అందించడంతో ఫోర్తుటౌన్ క్రైం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బడ్జెట్‌లో దళితులకు అన్యాయం

సీతంపేట: జనాభాలో 18 శాతం ఉన్న దళితులకు కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ అన్నారు. రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన దళితులకు బడ్జెట్‌లో రూ.81 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.46 వేల కోట్లు కేటాయించారన్నారు. ఎస్సీ కమిషన్‌కు గత బడ్జెట్‌లో రూ.71 కోట్లు కేటాయిస్తే, ఈసారి రూ.41 కోట్లు కేటాయించడం అన్యాయమన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విదేశీ విద్యా పథకానికి గత బడ్జెట్‌తో పోల్చితే రూ.50 కోట్లు కోత విధించారన్నారు. గత బడ్జెట్‌తో పోల్చుతూ దళితులకు కేటాయింపుల్లో ఉన్న వ్యత్యాసాన్ని వివరించే లేఖ విడుదల చేశారు. కుల వివక్ష పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చిరంజీవి మాట్లాడుతూ నేషనల్ షెడ్యూల్ క్యాస్ట్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నిధులు కేటాయింపు జరగలేదన్నారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి జి.రాంబాబు మాట్లాడుతూ జీవిత బీమా సంస్థల్లో ప్రైవేటు పెట్టుబడులకు 100 శాతం అవకాశం కల్పించడం అంటే దళితులకు ఇన్సూరెన్స్ కంపెనీలో రిజర్వేషన్లు లేనట్టే అన్నారు. సమావేశంలో కుల వివక్ష పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.సుబ్బన్న, దళిత నాయకులు ఎస్.రాజులు, ఆర్.సత్యవతి పాల్గొన్నారు.


నిధుల విడుదలలో వ్యత్యాసాన్ని తెలిపే లేఖను చూపుతున్న జేవీ ప్రభాకర్, తదితరులు

అధ్వానంగా గ్రీన్‌బెల్ట్‌లు

సీతమ్మధార: జోన్–3 పరిధిలో పలు గ్రీన్‌బెల్టు స్థలాలు అధ్వానంగా తయారవుతున్నా ఉద్యాన విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. 24వ వార్డు రేసపువానిపాలెం సచివాలయం సమీపంలోని గ్రీన్‌బెల్ట్ స్థలం ఫెన్సింగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అప్పటి నుంచి ఇక్కడ పశువులు తిష్టవేసి పచ్చదనాన్ని మాయం చేస్తున్నాయి. నగరంలో పచ్చదనం కోసం జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాల్లో గ్రీన్‌బెల్ట్‌లను అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. అయితే కొందరు వ్యక్తులు వీటిని ఆక్రమించి, తమ స్వప్రయోజనాలకు వినియోగించుకుంటున్నా పట్టించుకునే నాథుడు కరవయ్యారు. చీకటి పడిందంటే చాలు మందుబాబులు ఎక్కడెక్కడినుంచో ఇక్కడికొచ్చి వాలిపోతారు. ఆ ఖాళీ సీసాలు, గ్లాసులు, ఇతర చెత్తాచెదారం అక్కడే పేరుకుపోతోంది. పారిశుధ్యం మచ్చుకైనా కానరాదు. ఇప్పటికైనా జోన్–3 ఉద్యానవిభాగం అధికారులు, పబ్లిక్ వర్క్స్ ఇంజనీర్లు స్పందించి గ్రీన్‌బెల్టు స్థలంలో ఫెన్సింగ్ పునరుద్ధరించి, అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.


గ్రీన్‌బెల్ట్‌లో పశువులు, చెత్తాచెదారం

సరస్వతీ నమస్తుభ్యం.. విద్యారంభం కరిష్యామి

వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాలు


శ్రీలలితాపీఠంలో చిన్నారిచే అక్షరాలు దిద్దిస్తున్న ఉత్తరాధికారి దత్తేశ్వరానంద స్వామి

సీతంపేట: మాఘ శుద్ధ పంచమి, సరస్వతీ దేవి జన్మించిన రోజు సందర్భంగా ఆలయాల్లో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. లలితా పీఠం, శంకరమఠంలో సరస్వతీదేవికి పంచామృతాభిషేకాలు, అష్టోత్తర పూజ జరిపారు. సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

• స్థానిక లలితాపీఠంలో పీఠం అర్చకులు శాస్త్రోక్తంగా చిన్నారుల చేత అక్షరాభ్యాసం చేయించారు. ముందుగా గణపతి పూజ, సరస్వతి పూజ, ధన్వంతరి పూజ అనంతరం చిన్నారుల చేత బియ్యంలో పసుపు కొమ్ములతో ఓం నమశ్శివాయః సిద్ధం నమః అని అక్షరాలు రాయించారు. ఆ తర్వాత పలకపై బలపంతో 'అ, ఆ'లు దిద్దించారు. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద స్వామి, పేరెంట్స్ చిన్నారుల చెయ్యి పట్టి అక్షరాలు దిద్దించారు. పీఠం తరఫున పలక, బలపం అందించారు. అక్షరాభ్యాసం చేసిన చిన్నారులకు జ్ఞాన సంపద కలగాలని ఆశీర్వదించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


శ్రీలలితాపీఠంలో సామూహిక అక్షరాభ్యాసం


పట్టాభిరెడ్డితోట ఎంఎస్ఎం పాఠశాలలో ..

వాగ్దేవి పాఠశాలలో...
అక్కయ్యపాలెం వాగ్దేవి స్కూల్లో సరస్వతీదేవి చిత్రపటానికి విద్యార్థుల చేత పూజ చేయించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఎస్.ఎల్.శైలజ విద్యార్థులకు సరస్వతి పూజ విశిష్టత వివరించారు.

మురళీనగర్: వసంత పంచమి సందర్భంగా మురళీ నగర్ పరిసర ప్రాంతాల్లో ప్రజలు సరస్వతీదేవికి పూజలు చేశారు. పట్టాభిరెడ్డితోట ఎంఎస్ఎం పాఠశాలలో కరస్పాండెంట్ యు.సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో సరస్వతీదేవికి పూజలు చేశారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ముందుగా సరస్వతీదేవి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. తల్లిదండ్రులు చిన్నారులకు కొత్త దుస్తులు ధరించి ఆలయంలో అక్షరాభ్యాసం చేయించారు. అర్చకులు ఒక పళ్లెంలో బియ్యం పోసి దానిని మూడు విభాగాలుగా చేసి, మొదటి దానిలో ఓం, రెండవ దాంట్లో నమఃశివాయ, మూడో భాగంలో సిద్ధం నమః అని మూడుసార్లు పిల్లలచే రాయించారు. సుమారు వంద మంది పిల్లలు పూజకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శివ పాల్గొన్నారు.


అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న అర్చకులు రాజాస్వామి


వాగ్దేవి పాఠశాలలో సరస్వతి పూజలో విద్యార్థులు

సరస్వతి అలంకరణలో ఉమాదేవి
జీవీఎంసీ 24వార్డు నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో వసంత పంచమి సందర్భంగా అర్చకులు రామారావుశర్మ, మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమాదేవి అమ్మవారిని సరస్వతీదేవిగా అలకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారికి గాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు.


కంచరపాలెం కూడలిలో..


తాటిచెట్లపాలెం వెళ్లే రహదారిలో..

అత్యుత్సాహం!

కంచరపాలెం నేతాజీ కూడలిలో ట్రాఫిక్ పోలీసుల అత్యుత్సాహం ట్రాఫిక్ ఇక్కట్లకు కారణమవుతోంది. ఉదయం 8 గంటల సమయంలో ఉద్యోగులు, కార్మికులు తమ విధులకు వడివడిగా వెళ్లేటప్పుడు ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడలిలో రోడ్డుకు మధ్యగా ద్విచక్ర వాహనదారులను ఆపి మరీ.. పాత చలానాలను ఫోన్‌లో చెక్ చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ నియంత్రణలో లేని బాధ్యత, చలానా వసూళ్లపై మాత్రం చూపడంతో వాహనదారులు విమర్శలు చేస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా నిలబడి ద్విచక్ర వాహనాలు ఆపుతుండంతో తమ పిల్లలను విద్యా సంస్థలకు త్వరగా పంపే ఉద్దేశంతో ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు. ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.
– కంచరపాలెం